సాక్షి మెదక్

శనివారం ¦ 20 ¦ ఏప్రిల్ ¦ 2024



ఉచిత శిక్షణ.. భవితకు రక్షణ

పోటీ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేందుకు గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. వివరాలు 8లో ▸



మూతబడిన వసతి గృహం

వసతి గృహాలు అధ్వానంగా మారాయి. శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇందులో ఉండడానికి ఆసక్తి చూపడం లేదు. వివరాలు 9లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: రెప్యూటెడ్ (కార్పొరేట్) జూనియర్ కళాశాలల స్కీం కోసం జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు దరఖాస్తులు అందజేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27లోగా తెలంగాణ ఈ పాస్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని కలెక్టరేట్‌లో సమర్పించాలని సూచించారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనను జయప్రదం చేయండి



కాంగ్రెస్‌లో చేరిన వారితో మదన్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రం వెల్దుర్తిలో బీఆర్‌ఎస్‌కు చెందిన సీనియర్ నాయకులు వెంకటేశంగౌడ్, శివాగౌడ్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం రాజకీయాలకతీతంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సమష్టి కృషితో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, మల్లేశం, మల్లేశ్‌చారి, శ్రీశైలం, కుస్తి శేఖర్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రామాయంపేట(మెదక్): అంబేడ్కర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్‌వెంకటాపూర్‌లో నాలుగు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు చట్టప్రకారం వ్యవహరించకపోతే కమిషన్ తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. అనంతరం దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు యాదగిరి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, కౌన్సిలర్ అనిల్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో టార్పాలిన్లు



తేమశాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో నిజాంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, సీఈఓ శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన సరుకును కేంద్రానికి తీసుకురావాలని, క్వింటాల్‌కు రూ.6,760 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని రామాయంపేట, పెద్దశంకరంపేటలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ఆమె వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 381 ఎకరాల్లో పంట సాగవుతుందని, ఈమేరకు 3,048 క్వింటాళ్ల మేర పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్, మండల వ్యవసాయ అధికారులు రాజీనారాయణ సతీశ్, మార్క్‌ఫెడ్ అధికారి తిరుపతి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సమీకృతం.. అసంపూర్ణం

నత్తనడకన సమీకృత భవన నిర్మాణ పనులు



తూప్రాన్‌లో చివరి దశకు చేరిన సమీకృత భవన నిర్మాణ పనులు

తూప్రాన్: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.8 కోట్ల నిధులతో తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమీకృత భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. 2022 మార్చిలో అప్పటి మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

90 శాతం పనులు పూర్తి

గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ డివిజన్ కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండి ప్రజలకు సేవలందించాలన్నది గత ప్రభుత్వ సంకల్పం. ఇందుకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఐకేపీ, తహసీల్దార్, మండల వనరుల కేంద్రం భవనాలను కూల్చివేసి సమీకృత భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. ఏడాది వ్యవధిలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాని మూడేళ్లు గడుస్తున్నా పనులు ఇప్పటికీ 90 శాతం మాత్రమే పూర్తయ్యాయి. గతంలో గడా ప్రత్యేకాధికారిగా నియమితులైన ముత్యంరెడ్డి పలుమార్లు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాని అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భవన నిర్మాణంలో గోడలు, రంగులు, విద్యుత్ సరఫరాకు వైరింగ్, తదితర పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే సమీకృత భవనం అందుబాటులోకి వస్తే తూప్రాన్ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, నార్సింగి మండలాల ప్రజలకు ప్రభుత్వ సేవలు ఒకే చోట లభించనున్నాయి. డివిజన్ కేంద్రం ఏర్పడినప్పటికీ సరైన సౌకర్యాలు లేని భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. సమీకృత భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తాం

తూప్రాన్‌లో సమీకృత భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల కోసం ప్రభుత్వానికి రూ.10 కోట్లతో అంచనా వేసి నివేదిక పంపించాం. ప్రస్తుతం భవనం పూర్తి దశకు వచ్చింది. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలిపోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ, తూప్రాన్



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన హన్మంతరావు, నీలం మధు

మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మంత్రి కొండా సురేఖ

మెదక్‌జోన్: మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అటవీ, దేవాదాయ, పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ వస్తున్న సందర్భంగా హెలిప్యాడ్ స్థలాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఈ గడ్డ నుంచి ఇందిరాగాంధీ ఎంపీగా గెలుపొంది ప్రధానమంత్రి అయ్యారని గుర్తుచేశారు. ఈసీటు రాష్ట్రంలోనే అత్యంత కీలకమైందన్నారు. నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం హన్మంతరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఓడిపోయినా వారి అహంకారం మాత్రం తగ్గలేదన్నారు. ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ కేసీఆర్ మాట్లాడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఐదు గ్యారంటీలు అమలుచేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుందని చెప్పారు. మాకు అన్నిమతాలు సమానమేనని, దేవుళ్లతో రాజకీయం చేసిన వారు మూల్యం చెల్లించుకోకతప్పదని బీజేపీని ఉద్దేశించి అన్నారు. సర్వేలన్నీ మాకు అనుకూలంగా వస్తున్నాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, నాయకులు జీవన్‌రావు, గంగా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో రుణమాఫీ చేస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఎన్నికల కోడ్ ముగియగానే ఆగస్టులో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ పదేళ్లు అధికారంలో ఉన్నా తెలంగాణకు ఒక విద్యాలయం, ఒక వైద్యాలయం తేలేదన్నారు. విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. నియంత నరేంద్రమోదీ, మానవతావాది రాహుల్‌గాంధీ మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ అమరులను మోదీ అవమానించారన్నారు. నేను ఐదేళ్లు ఎంపీగా చేశాని, వినోద్‌కుమార్, ఇప్పుడున్న ఎంపీ బండి సంజయ్ ఏమి చేశారో తేల్చుకుందామని సవాల్ విసిరితే ఎవరు రాలేదన్నారు. శ్రీరాముడు అందరివాడని, ఇప్పుడు ఇంటింటికీ శ్రీరాముడి ఫొటోలు పంచుతూ గోడలకు పేర్లు రాస్తూ ఓట్లు అడుగుతున్నారని తెలిపారు.

రాజకీయ కుట్రదారులకు చెంపపెట్టు

మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో 106 మంది ఉద్యోగుల సస్పెన్షన్‌పై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రాజకీయ కుట్రదారులకు చెంపపెట్టు అని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 106 మంది ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్ మీద స్టే విధిస్తూ తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని సూచించడం శుభపరిణామమన్నారు. చివరికి ధర్మం విజయం సాధించిందని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఉద్యోగులను అడ్డం పెట్టుకొని రాజకీయ దాడికి పాల్పడినట్టు ఆరోపించారు. ఓటు ద్వారా ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని కోరారు.

రెండోరోజు 4 నామినేషన్లు

మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ స్థానానికి రెండో రోజు 4 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రజావెలుగు పార్టీ నుంచి సారా యాదగిరిగౌడ్ మొదటి నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా బొమ్మల విజయ్‌కుమార్ ఒక సెట్, మరో స్వతంత్ర అభ్యర్థి తుమ్మలపల్లి పృథ్వీరాజ్ మొదటి సెట్ నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గొల్లపల్లి సాయిగౌడ్ నామినేషన్ దాఖలు చేసినట్లు వివరించారు.

పక్కాగా అభ్యర్థుల ఖర్చు



మాట్లాడుతున్న సునీల్ కుమార్ రాజ్ వాన్షీ, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్ వాన్షీ
- రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం

మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్ వాన్షీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను సెగ్మెంట్ల వారీగా నమోదు చేయాలని సూచించారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షో లు అన్నింటిని వీడియో సర్వేయలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేయాలన్నారు. సదరు వీడియోలు పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులతో సమన్వయం చేసుకోవాలన్నారు. షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేసి పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని ఆయన సూచించారు.

ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్

ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు: డీఎంహెచ్‌ఓ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి శ్రీరాం సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని వసతుల గురించి ఆరా తీశారు. ఆస్పత్రి భవనం పాతబడినందున నూతన భవనం నిర్మించేలా చూడాలని స్థానిక మెడికల్ ఆఫీసర్ అనిల్‌రెడ్డి డీఎంహెచ్‌ఓను కోరారు. ఆస్పత్రిలో కావాల్సిన వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందికి వైద్య సేవలపై పలు సూచనలు చేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

కనులపండువగా రథోత్సవం



రథోత్సవంలో భక్తుల కోలాహలం

జోగిపేట(అందోల్): జోగినాథ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గురువారం రాత్రి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య దేవతామూర్తుల విగ్రహాలతో రథం ముందుకు సాగింది. రథోత్సవం ప్రధాన రహదారుల గుండా కొనసాగుతూ శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో దేవాలయం వద్దకు చేరుకుంది. డప్పుచప్పుళ్లు, కళాకారుల నృత్యాలు చూపరులను అలరించాయి. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఎక్స్‌ప్రెస్.. నో స్టాప్

- రామాయంపేటలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

రామాయంపేట(మెదక్): ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన రామాయంపేట పరిస్థితి నేడు దయనీయంగా మారింది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. దీంతో పట్టణవాసులకు ఆర్డీనరీ బస్సులే దిక్కయ్యాయి. కామారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, నిర్మల్, అదిలాబాద్ డిపోల నుంచి రామాయంపేట మీదుగా హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు గతంలో బస్టాండ్‌లోకి వచ్చేవి. ప్రస్తుతం ఈ డిపోలకు చెందిన బస్సులు చాలా వరకు పట్టణంలోకి రాకుండా నేరుగా జాతీయ రహదారి పైనుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో ఈప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఆర్డీనరీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లిన వారు రాత్రివేళలో ఇక్కడికి రావాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. రామాయంపేట స్టాప్ ఉన్న బస్సులు సైతం పట్టణంలోకి రాకుండా నేరుగా జాతీయ రహదారిపై నుంచే వెళ్తుండడంతో కామారెడ్డి టికెట్ తీసుకొని పట్టణ శివారులో బస్సు దిగి కాలినడకన పట్టణంలోకి వస్తున్నారు.

అమలుకాని ఆర్టీసీ చైర్మన్ హామీ!

2021లో అప్పటి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రామాయంపేటకు వచ్చిన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఆవశ్యకతను వివరించి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన బస్టాండ్ నిర్మాణానికి గానూ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలాన్ని పరిశీలించి హామీ ఇచ్చారు. మూడేళ్లు అవుతున్నా హామీ ఇప్పటికీ అమలు కాలేదు. నూతన ప్రభుత్వం ఈవిషయమై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రామాయంపేట బస్టాండ్

కారుమబ్బులతో కలవరం

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో కారుమబ్బులు కలవరపెడుతున్నాయి. అక్కడక్కడ చిరు జల్లులతో కూడిన వర్షం ఆందోళనకు గురిచేస్తోంది. 15 రోజులుగా వరి కోయాలని పంటకు నీరు పెట్టకుండా కాపాడుకుంటూ వచ్చిన రైతులు అకాలవర్షాలతో అయోమయానికి గురవుతున్నారు. కోతకు వచ్చిన సమయంలో వర్షాలు పడడంతో ఏం చేయాలో తోచక కొట్టుమిట్టాడుతున్నారు. మరికొంత మంది రైతులు వరిని కోసి కుప్పలుగా ఆరబోశారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచారు.

– టేక్మాల్(మెదక్)



టేక్మాల్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి



ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

క్లుప్తంగా

ఏసీబీ అధికారుల అదుపులో..

- మెదక్‌రూరల్‌ ఎస్‌ఐ అమర్‌, కానిస్టేబుల్‌ బాసిద్‌
- అవినీతి ఆరోపణలపై విచారిస్తున్నట్లు సమాచారం

హవేళిఘణాపూర్‌(మెదక్‌): అవుసులపల్లి గ్రామానికి చెందిన చంద్రం వద్ద నుంచి గత నెల 19న రూ.4వేలు తీసుకుంటూ కానిస్టేబుల్‌ సురేందర్‌(రైటర్‌) పట్టుబడిన విషయం తెల్సిందే. ఈ కేసుకు సంబంధించి మెదక్‌ కలెక్టరేట్‌ కార్యాలయం వద్ద బందోబస్తులో ఉన్న మెదక్‌ రూరల్‌ ఎస్‌ఐ అమర్‌, కానిస్టేబుల్‌ బాసిద్‌ను అదుపులోకి తీసుకొని కలెక్టరేట్‌ కార్యాలయంలోని ఓ గదిలో విచారిస్తున్నట్లు తెల్సింది. ఈ విషయంపై మెదక్‌రూరల్‌ సీఐ కేశవులును ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పట్టుబడిన నరేందర్‌ రూ.15 వేలు ముందు తీసుకున్నప్పటికీ తిరిగి ట్రాక్టర్‌ రిలీజ్‌ చేసే సమయంలో మరో రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశాడు. బాధితుడు ముందుగానే రూ.15వేలు ఇచ్చాను కదా? అని చెప్పడంతో అవి సార్‌కు ఇచ్చాను. తనకు రూ.5 వేలు ఇవ్వాలంటూ చెప్పాడు. ఆ సారెవరు అనే దానిపై విచారణ జరుపుతున్నట్లు తెల్సింది.

తునికాకు కోసం వెళ్లి అదృశ్యం


భాగమ్మ(ఫైల్‌)

వెల్దుర్తి(తూప్రాన్‌): తునికాకు సేకరించడానికి అటవీ ప్రాంతానికి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని మానెపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి భాగమ్మ, శేఖయ్య భార్యాభర్తలు. భాగమ్మ(50) గురువారం ఉదయం 10 గంటల సమయంలో తునికాకు సేకరించడం కోసం అడవిలోకి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రి నుంచి అడవిలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై ఎస్‌ఐ నవత గౌడ్‌ను వివరణ కోరగా మహిళ అదృశ్యంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

శివ్వంపేటలో వ్యక్తి..


చాంద్‌పాష

శివ్వంపేట(నర్సాపూర్‌) : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యం.డీ చాంద్‌పాష ఈ నెల 11న రంజాన్‌ పండుగ రోజు స్నేహితుల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంత సేపు అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం చాంద్‌పాష అన్న వాహేద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

రోడ్డు కిందికి దూసుకెళ్లిన స్కూల్‌ బస్సు



కంగ్టి(నారాయణఖేడ్‌): స్కూల్‌ పిల్లలకు తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని తడ్కల్‌ గ్రామంలో కొనసాగుతున్న ఓ ప్రైవేట్‌ పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకెళ్లడానికి కంగ్టి మండలం చాప్టా(కే) గ్రామానికి వెళ్తుంది. ఈ క్రమంలో బస్సు బ్రేక్‌ ఫెయిలై అదుపుతప్పి రోడ్డు కిందికి వెళ్లింది. బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఉచిత శిక్షణ.. భవితకు రక్షణ

నీట్‌, జేఈఈ, ఎప్‌సెట్‌ పోటీ పరీక్షలకు కోచింగ్‌

- ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ గిరిజన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- స్టడీ మెటీరియల్‌ అందజేత
- ప్రవేశ పరీక్షల్లో మెరుగైన ర్యాంకు సాధించడమే లక్ష్యం

నీట్‌, జేఈఈ, ఎప్‌సెట్‌ తదితర పోటీ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేందుకు గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. నర్సాపూర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ జూనియర్‌ కాలేజీలో చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణ ఇస్తారు. గత నెల 18నుంచి ప్రారంభించి ఆయా పోటీ పరీక్షలు నిర్వహించే రోజు వరకు ఈ శిబిరం కొనసాగనుంది. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.

– నర్సాపూర్‌


నర్సాపూర్‌లోని గిరిజన సంక్షేమ జూనియర్‌ కళాశాల

నీట్‌, జేఈఈ, ఎప్‌సెట్‌ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకోవాలంటే ప్రైవేటు కోచింగ్‌ సెంటర్లలో భారీగా ఫీజులు చెల్లించాలి. కానీ అధికంగా ఫీజులు చెల్లించి శిక్షణ తీసుకోకపోవడంతో మెరుగైన ర్యాంకులు సాధించలేక మంచి కాలేజీల్లో సీటు సాధించలేకపోతున్నారు. ఈ క్రమంలో గిరిజన విద్యార్థులను ప్రవేశ పరీక్షలకు సమర్థులుగా మార్చేందుకు నర్సాపూర్‌లో ప్రత్యేక ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

స్టడీ మెటీరియల్‌ అందజేత..

గిరిజన జూనియర్‌ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులు 59 మంది, ద్వితీయ సంవత్సరం


కంప్యూటర్లపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థులు 66 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించారు. వీరిలో పది మంది చురుకైన విద్యార్థులను ఎంపిక చేసి గిరిజన గురుకుల విద్యాలయానికి చెందిన రాజేంద్రనగర్‌లోని ఐఐటీ స్టడీ సెంటర్‌కు ప్రత్యేక శిక్షణ నిమిత్తం పంపారు. కాలేజీకి చెందిన పది మంది లెక్చరర్లతో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. గురుకుల విద్యాలయం నిర్ణయించిన మేరకు కంప్యూటర్‌ ద్వారా ఎంబైబ్‌ ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫాంపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ కూడా అందజేస్తున్నారు.

వీకెండ్‌ టెస్ట్‌లు నిర్వహణ

శిక్షణ ప్రణాళికబద్ధంగా చేపడుతూ ప్రతీ ఆదివారం విద్యార్థులకు వీకెండ్‌ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా వారి సామర్థ్యం గుర్తించి వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. శిక్షణను కాలేజీ ప్రిన్సిపాల్‌ భిక్షమయ్య పర్యవేక్షిస్తూ విద్యార్థులకు శిక్షణ సరైన విధంగా అందేలా కృషి చేస్తున్నారు. అవసరమైన మెటీరియల్‌, ఇతర సదుపాయాలు గురుకుల విద్యాలయం నుంచి అందించేందుకు గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ మెదక్‌, కామారెడ్డి, నిజామాబాద్‌ జిల్లాల ఏరియా కోఆర్డినేటర్‌ సంపత్‌ కుమార్‌ తన వంతు కృషి చేస్తున్నారు.

శిక్షణ బాగుంది



కాలేజీలో ప్రత్యేక శిక్షణ శిబిరంలో మాకు ఇస్తున్న శిక్షణ బాగుంది. తాను ఐఐటీలో సీట్‌ పొందడానికి శిబిరంలో శిక్షణ తీసుకుంటున్నాను. లెక్చరర్లు బోధనకు అనుగుణంగా కష్టపడి చదువుతున్నాను. సీట్‌ పొందుతానన్న నమ్మకం ఉంది.

– ఎల్‌. లోకేష్‌, ఎంపీసీ విద్యార్థి

నీట్‌లో సీటు కొడతా



కాలేజీలో తమకిస్తున్న శిక్షణ చాలా బాగుంది. ఇక్కడ శిక్షణ తీసుకోవడం ద్వారా నీట్‌లో సీటు పొందగలనన్న నమ్మకం పెరిగింది. శిక్షణలో పోటీ పరీక్షకు సంబంధించిన అంశాలను చెప్పడంతోపాటు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు.

– డీ.అనీల్‌, బైపీసీ విద్యార్థి

విద్యార్థులకు ఉపయోగకరంగా..

తమ కాలేజీలో చదివిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. నీట్‌, జేఈఈ, ఎప్‌సెట్‌ పోటీ పరీక్షలకు శిక్షణ కొనసాగుతుంది. ఈ శిబిరంతో విద్యార్థులకు చాలా మేలు జరుగుతుంది. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

– భిక్షమయ్య, కాలేజీ ప్రిన్సిపాల్‌

పోటీ పరీక్షల్లో రాణించేలా..

గిరిజన విద్యార్థులు పోటీ పరీక్షలు రాసేందుకు డబ్బులు పెట్టి ప్రైవేటులో శిక్షణ పొందలేరని గిరిజన గురుకులాల విద్యాలయ సంస్థ గుర్తించి తమ కాలేజీల్లోనే ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్‌ సైతం అందజేశాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ప్రవేశ పరీక్షలో మెరుగైన ర్యాంకులు సాధించి మంచి కాలేజీల్లో సీట్లు పొందాలని కోరుకుంటున్నాను.

– సంపత్‌కుమార్‌, గిరిజన గురుకుల విద్యాలయాల కో ఆర్డినేటర్‌

వడదెబ్బతో టైలర్‌ మృతి


సురేశ్‌ మృతదేహం

హుస్నాబాద్‌: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన ఘటన హుస్నాబాద్‌ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని 10వ వార్డు జ్యోతినగర్‌కు చెందిన మెలుగూరి సురేశ్‌ (36) టైలర్‌ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మధ్యాహ్నం తీవ్రమైన ఎండలో టైలర్‌ షాపునకు వెళ్లాడు. తిరిగి నిరసంగా ఇంటికొచ్చి ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య మమత, ఇద్దరు కుమారులు రోహిత్‌, రాహుల్‌తో పాటుగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు.

భార్యతో గొడవపడి ఇంటిని దహనం


కాలిపోతున్న ఇల్లు

కొల్చారం(నర్సాపూర్‌): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి నివాస పూరిల్లును దహనం చేసిన ఘటన శుక్రవారం మండలంలోని ఎనగండ్ల బీసీ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తలారి అశోక్‌ ఉదయం భార్య బాలమణితో గొడవపడ్డాడు. విషయం తెలిసిన అతని బావమరిది వచ్చి బాలమణిని పుట్టింటికి తీసుకెళ్లాడు. సాయంత్రం బయటకి వెళ్లి వచ్చిన అశోక్‌ తన నివాస పూరిఇల్లుకు నిప్పంటించడంతో కాలి బూడిదైపోయింది. ఇంట్లోని వస్తువులన్నీ తగలబడిపోయాయి.

నెత్తురోడిన రహదారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు.

బస్సును ఢీకొని వ్యక్తి..


ఘటనా స్థలంలో రాములు

వట్‌పల్లి(అందోల్‌)/పాపన్నపేట(మెదక్‌): ఆగి ఉన్న బస్సును బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం నాందేడ్‌–అకోలా జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం మదిరే కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లంపేట రాములు(35) సంగారెడ్డిలో కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం స్వగ్రామానికి వెళ్లి తిరిగి బైక్‌పై సంగారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంగుపేట గ్రామ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ..


బాలాజీ(ఫైల్‌)

కంగ్టి(నారాయణఖేడ్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకొంది. కంగ్టి ఎస్సై విశ్వజన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దెగుల్‌వాడి గ్రామానికి చెందిన మచ్కూరి బాలాజీ(45) పని నిమిత్తం బైక్‌పై కంగ్టికి వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఎదురుగా ఢీ కొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మచ్కూరి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం ఢీకొని..

గజ్వేల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడలో శుక్రవారం చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోశి మల్లేశం(43) తమకున్న కొద్దిపాటి భూమిలో పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం వ్యవసాయ భూమి వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. రిమ్మనగూడ నుంచి ప్రజ్ఞాపూర్‌ వైపు రాజీవ్‌ రహదారిపై వెళ్తుండగా గ్రామ శివారులో వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు మృతి

బైక్‌ను ఢీకొట్టిన ఆటో..

కొండపాక(గజ్వేల్‌): బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్‌ రోడ్డు వద్ద రాజీవ్‌ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌ కథనం మేరకు.. జనగామ జిల్లా బచ్చన్న పేట గ్రామానికి చెందిన అశోక్‌(65) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సిద్దిపేటలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. వెలికట్ట శివారులోకి రాగానే హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న గూడ్స్‌ ఆటో ఢీకొట్టింది. దీంతో అశోక్‌ వాహనంపై నుంచి ఎగిరి రాజీవ్‌ రహదారిపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు లక్ష్మణ్‌ ఫిర్యాదు మేరకు రాజస్తాన్‌కు చెందిన గూడ్స్‌ ఆటో డ్రైవరు నేమిచంద్‌ జిట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగుపాటుకు జీవాలు మృతి

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు


అల్లాదుర్గం(మెదక్‌) : పాడి గేదెల వద్ద బాధితులు

అల్లాదుర్గం(మెదక్‌): అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. భారీ వర్షం కురవడంతో పంటలు దెబ్బతినగా, పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నడిమితండాకు చెందిన సక్కుబాయి రెండు పాడి గేదెలను మేపుకుంటూ పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. పాడి గేదెలను చెట్టు కింద కట్టేయగా శుక్రవారం కురిసిన వర్షానికి పిడుగుపడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.లక్షన్నర వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయారు. అలాగే వర్షానికి అల్లాదుర్గంలో విద్యుత్‌ వైర్లు తెగిపడి మూడు గంటల పాటు కరెంట్‌ సరఫరా నిలిచిపోయింది. బలమైన గాలులు వీచడంతో బహిరన్‌దిబ్బ, వెంకట్‌రావ్‌పేట, అల్లాదుర్గం, గడిపెద్దాపూర్‌ గ్రామాల్లో జొన్న పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మృతి చెందిన ఎద్దు

జగదేవ్‌పూర్‌లో ఎద్దు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): పిడుగుపడి కాడెద్దు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చాట్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన భూమల్ల కొండయ్య తనకున్న రెండు కాడెద్దులను బావి వద్ద కట్టేశాడు. శుక్రవారం సాయంత్రం పిడుగుపడి ఎద్దు మృతి చెందింది.

ఝరాసంగం(జహీరాబాద్‌): పిడుగుపాటుతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పొట్టి పల్లి గ్రామంలో పిడుగు పడటంతో అదే గ్రామానికి చెందిన శ్రీశైలం ఆవు మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.75 వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. అదే విధంగా మండలంలో గాలివాన బీభత్సానికి ప్రధాన రహదారులు మాచ్నూర్బర్దిపూర్‌, కృష్ణా పూర్వస్తాపూర్‌ గ్రామాల మధ్య వృక్షాలు నేలకు ఒరిగాయి.

లారీని ఢీకొట్టిన కారు

- డ్రైవర్‌తోపాటు మహిళ అక్కడికక్కడే మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్‌: ఔటర్‌ రింగ్‌ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌, మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ఘటన పటాన్‌చెరు మండలం బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్‌ సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌ చాంద్రాయణగుట్టకు చెందిన సర్వర్‌, భార్య ఫాతిమా(50), కుటుంబ సభ్యులు మహమ్మద్‌, షఫీ, జాఫర్‌ కలిసి హైదరాబాద్‌లో ఓ ఇన్నోవా కారును మాట్లాడుకొని ఈనెల 18వ తేదీన కర్ణాటకలోని గుల్బర్గా దర్గాకి వెళ్లారు. శుక్రవారం తెల్లవారు జామున హైదరాబాద్‌ వైపు వస్తుండగా పటాన్‌చెరు మండలం పాటీ గ్రామ శివారు కొల్లూరు ఎగ్జిట్‌ గేటు–2 సమీపంలోకి రాగానే కారును అతివేగంగా నడుపుకుంటూ వచ్చి డ్రైవర్‌ మిస్కిన్‌ అలియాస్‌ మునివర్‌(35) ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై డ్రైవర్‌ మిస్కిన్‌తో పాటు కారులో ఉన్న మహిళ ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మహమ్మద్‌, సర్వర్‌, షఫీ, జాఫర్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాద స్థలంలో దెబ్బతిన్న కారు

రైలు ఢీకొని రైతు..

రాయపోలు(దుబ్బాక): రైలు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన రాయపోలు మండలం బేగంపేటలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు గ్రామానికి చెందిన రైతు చిటుకుల నర్సింలు(50) వ్యవసాయ పొలం, రైల్వేలైను పక్కపక్కనే ఉన్నాయి. రోజూ మాదిరిగా శుక్రవారం పొలానికి వెళ్లిన నర్సింలు పొలం పనులు చూసుకొని మధ్యాహ్నం గేదెలకు నీళ్లు తాగించేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే లైనుపై ఉన్న కంకరలో కాలుజారి పట్టాలపై పడిపోయాడు. ఇదే సమయంలో సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు రైలు వెళ్తుంది. రైలు ముందు భాగం ఉన్న ఇనుప జాలీ నర్సింలు తలకు వేగంగా తాకడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అల్వాల్‌ రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

కోహీర్‌(జహీరాబాద్‌): రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కోహీర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. కోహీర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన వినోద్‌కుమార్‌ బీదర్‌–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో లింగంపల్లి వెళ్తున్నాడు. కోహీర్‌ రైల్వే స్టేషన్‌ దాటి 24వ నంబర్‌ గేటు సమీపంలో డోర్‌ వద్ద నిలుచొని బయటికి చూస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

అక్రమ మద్యం పట్టివేత

సిద్దిపేటకమాన్‌: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన సిద్దిపేటలో శుక్రవారం జరిగింది. సిద్దిపేట టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని బండారి రాము ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో నిల్వ చేసిన 6.150 లీటర్ల మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే సిద్దిపేట రూరల్‌ పోలీసు స్టేషన్‌ చౌరస్తా సమీప గంగుల ఆనంద్‌ కిరాణం దుకాణంలో టాస్క్‌ఫోర్స్‌, వన్‌టౌన్‌ పోలీసులు సోదాలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 9.770 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో టూటౌన్‌ ఎస్‌ఐ రాజేశం, ఏఎస్‌ఐ ఉమారెడ్డి పాల్గొన్నారు.

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): టాస్క్‌ఫోర్స్‌, కోహెడ పోలీసులు సంయుక్తంగా బెల్ట్‌ షాపులపై దాడులు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంచంద్రాపూర్‌ గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బొమ్మగాని రంజిత్‌, గున్నాల రాజు ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. 20 లీటర్ల బీర్లు, విస్కీ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కొండపాక(గజ్వేల్‌): మద్యం విక్రేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి కొడకండ్లలోని కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు తనిఖీ చేపట్టి 22.475 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆలయంలో చోరీ

సిద్దిపేటరూరల్‌: మండల పరిధిలోని ఇర్కోడ్‌ శివారు మల్లికార్జున స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి 2 గంటల సమయంలో మూడు ఉత్సవ విగ్రహాలు, హుండీలోని నగదు, సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

అధికారులకు ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌ సూచన

రాయికోడ్‌(అందోల్‌): మండలంలోని నాగన్‌పల్లి, సింగితం గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌ శుక్రవారం పర్యటించారు. నాగన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు గత ఏడాది మన ఊరు మనబడి కింద నిధులు మంజూరు కాగా వాటితో పూర్తి చేసిన మరమ్మతు పనులు, వంటగది టాయిలెట్ల నిర్మాణం, తాగు నీటి సౌకర్యం, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను సైతం పరిశీలించారు. సింగితంలోని పాఠశాలకు 'అమ్మ ఆదర్శ పాఠశాల'లో భాగంగా రూ.18 లక్షలు మంజూరు కాగా.. వాటితో చేపట్టనున్న పనుల వివరాలను ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. ఆ నిధులతో నీటి సంపు, తాగునీటి సరఫరా, మేజర్‌, మైనర్‌ మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణ పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజలి దేవి, ఏపీఎం నర్సింహులు, ఏపీఓ రమేష్‌ కుమార్‌, ఏఈ తదితరులు ఉన్నారు.


నారాయణఖేడ్‌: నాగల్‌గిద్ద మండలం గంగారాం తండా, కరస్‌గుత్తి, కారాముంగి గ్రామాలను ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌ శుక్రవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. మిషన్‌ భగీరథ తాగునీటి సరఫరా స్థితిగతులపై గ్రామీణులనుఅడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జైపాల్‌, పంచాయతీరాజ్‌ ఏఈ రాకేష్‌, ఏపీఎం అనంతయ్య, పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌ భగీరథ పథకం అధికారులున్నారు.


రాయికోడ్‌: నాగన్‌పల్లి పాఠశాలలో ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌

ఝరాసంగంలో..

ఝరాసంగం(జహీరాబాద్‌): మండలంలోని దేవరంపల్లిలో నెలకొన్న తాగు నీటి సమస్య పరిష్కారానికి కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌ పేర్కొన్నారు. శుక్రవారం దేవరంపల్లి గ్రామాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు.

సీతారాముల రథోత్సవం


కోలాటం ఆడుతున్న మహిళలు

గజ్వేల్‌రూరల్‌: సీతారాముల రథోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకొని గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రామాలయ భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో మహిళలు రామాలయం నుంచి జగదేవ్‌పూర్‌ చౌరస్తా వరకు కోలామాడారు.

లక్ష్మీనర్సింహుడి తిరుకల్యాణం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో కొలువైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరుకల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ధ్వజారోహణ చిత్రపటాన్ని ఆవిష్కరించినట్లు పూజారి మధుసూదనాచారి తెలిపారు. టెంపుల్‌ డెవలప్‌మెంట్‌ ఫోర్స్‌, చిలాపూర్‌కు చెందిన కొప్పురపు రాంచంద్రారెడ్డి, రాజు దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ శర్మ, భక్తులు పాల్గొన్నారు.